సాక్షి పల్నాడు
బుధవారం । 6 । ఆగస్టు । 2025



కుంకుమ పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో మంగళవారం శ్రీ లక్ష్మీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.



వెల్లటూరులో సంకీర్తనలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని గీతా మందిరంలో మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భజన సంకీర్తనలు నిర్వహించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: రాయపూడి గ్రామంలో 23 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి స్థానిక శివాలయం సమీపంలో వీటిని పట్టుకున్నారు.

న్యూస్‌రీల్

13 నుంచి అమరేశ్వరుని పవిత్రోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో 13వ తేదీ బుధవారం నుంచి పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తామని ఆలయ ఈఓ రేఖ మంగళవారం తెలిపారు. యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల నేతృత్వంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు వేదపండితులచే ఉదక శాంతి, ఆలయ శుద్ధి, ప్రధాన ఉపాలయాల మూర్తులకు స్నపనాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారన్నారు. రెండోరోజు గురువారం మండప పూజలు, దీక్షా హోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం మూడవరోజు శుక్రవారం ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


ఐపీఎస్‌కు ఎంపికైన దోనేపూడి విజయ్‌బాబు

- ప్రస్తుతం ఐఆర్ఎస్ అధికారిగా విధులు నిర్వహణ
- నాలుగో పర్యాయం సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపిక



తెనాలి: పట్టణానికి చెందిన దోనేపూడి విజయ్‌బాబు ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2024 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు సర్వీసులను కేటాయిస్తూ యూపీఎస్‌ఈ మంగళవారం తుది ఫలితాలను విడుదల చేసింది. 2021 సివిల్స్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్‌కు ఎంపికైన విజయ్‌బాబు, ప్రస్తుతం విజయవాడలో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్ (ఇన్వెస్టిగేషన్స్) బాధ్యతల్లో ఉన్నారు. ఐఏఎస్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యం కోసం వరుసగా సివిల్స్ పరీక్షలు రాస్తూ వచ్చారు. నాలుగో పర్యాయం 681 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అయినప్పటికీ తనకు సంతృప్తి లేదన్నారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి అయిన తన తండ్రి దోనేపూడి మధుబాబు కోరిక ప్రకారం ఐఏఎస్ అధికారి కావాలన్నదే తన కలగా విజయ్‌బాబు చెప్పారు. అందుకోసం మరోసారి సివిల్స్ రాస్తానని తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 587.20 అడుగులకు చేరింది. ఇది 305.6242 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ఎడమ కాలువకు 8,541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,542, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 44,271 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 44,271 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



వినుకొండ: ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన నిర్వహించిన సబ్ జూనియర్ మరియు జూనియర్ బాలుర, బాలికల ఎంపికల్లో స్థానిక నరసరావుపేట రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎం.గౌతమ్, బి. వెంకటేశ్వర్లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 29న ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీఈటీ జోనా నాయక్, ఏటీపీ ఎస్కే ఖాశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. ప్రస్ఫుటం

- 14 నెలలుగా ఒక్క రూపాయి విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- కళాశాలలో నిలిచిన అభివృద్ధి పనులు
- హాస్టళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి
- కళాశాలలో వసతులు పరిశీలన

జేఎన్‌టీయూఏఎన్ అభివృద్ధిని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



జేఎన్‌టీయూఏఎన్‌లో నిలిచిపోయిన భవన నిర్మాణాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఏఎన్ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు విడుదల చేయలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాకానిలోని కళాశాలను మంగళవారం డాక్టర్ గోపిరెడ్డి సందర్శించి, క్యాంపస్‌లోని భవనాలను పరిశీలించారు. నిర్మాణాలు నిలిచిపోయిన విద్యార్థుల వసతి గృహాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ 2014లో మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి కృషితో కాకాని వద్ద జేఎన్‌టీయూఎన్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఇందుకు గాను 84 ఎకరాలు కేటాయించినట్టు తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ 2019 వరకు క్యాంపస్‌లో కనీసం ఇటుక కూడా వేయలేదన్నారు. క్యాంపస్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించి టెండర్లు పిలిస్తే పనులు చేయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని తెలిపారు.

హాస్టళ్ల నిర్మాణంపై శ్రద్ధ ఏదీ?

హాస్టల్ భవన నిర్మాణానికి కేవలం రూ.10 కోట్లు చాలని, వాటిని కూడా విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులు గురిచేస్తున్నారని తెలిపారు. కళాశాలలో దాదాపు 1200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వీరంతా పట్టణంలోని ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ కళాశాలకు రావాల్సి వస్తుందన్నారు. కళాశాలలో నిర్మాణంలో ఉన్న హాస్టళ్లు పూర్తయితే నాలుగు బ్లాక్‌ల్లో 700 గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



ఏడాదిగా నిలిచిన హాస్టల్స్ నిర్మాణ పనులు

పర్మినెంట్ ఫ్యాకల్టీని నియమించాలి..

కళాశాలలో 1200 మంది విద్యార్థులకు 13మంది రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ మాత్రమే ఉన్నారంటే విద్యాబోధన ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. 44మంది గెస్ట్ లెక్చరర్స్ ఇక్కడ పని చేస్తున్నారని తెలిపారు. టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

కళాశాలకు ముఖ్యమైన హాస్టల్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా స్థానిక ఎమ్మెల్యే వర్సిటీ వీసీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అవసరమైతే వీసీని క్యాంపస్‌కు పిలిపించి మాట్లాడాలని తెలిపారు. అప్పటి వరకు విద్యార్థులను కళాశాలకు చేరవేసేందుకు ఏర్పాటుచేసిన బస్సుల సంఖ్యను పెంచాలని సూచించారు. అభివృద్ధికి కృషిచేయకుండా కళాశాలలో ఉద్యోగాలు తమ వారికే కావాలని ఎమ్మెల్యే అడగడం బాధాకరమన్నారు. గోపిరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, దొండపాడు సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ దండా వీరాంజనేయులు, కనకా పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.150కోట్లతో అభివృద్ధి

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.150 కోట్లతో క్యాంపస్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకడమిక్ బ్లాక్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, యువతీ, యువకుల వసతి గృహాలు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలో ఒక్క రూపాయి పని కూడా కళాశాలలో నిర్వహించలేదని, ఒక్క ఇటుక వేసిన పాపాన పోలేదని గోపిరెడ్డి తెలిపారు. దీన్నిబట్టి కళాశాల అభివృద్ధిపై కూటమి నేతలకు ఉన్న శ్రద్ధ అర్థమవుతుందన్నారు.

అన్నదాతకు అవమానం



నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం మెట్లపై ఓ మూలన కూర్చున్న రైతులు శ్రీను, రామయ్య

దేశానికే అన్నం పెట్టే రైతు మెట్లపై కూలబడ్డాడు.. అధికారులు ఎప్పుడొస్తారో తెలీక.. అందాక కూర్చునే తావు లేక.. మళ్లీ ఎవరైనా కసురుకుంటారేమోనని బెరుకు బెరుకుగా.. మెట్లపై ఓ మూలన కూర్చున్నారు. అటు ఇటు కొందరు అధికారులు తిరుగుతున్నా.. మాకిది మామూలేననుకుంటూ వారిని పట్టించుకున్న పాపాన పోలేదు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11:30 గంటలకు కనిపించిన చిత్రమిది. అడంగల్‌లో తప్పుల సవరణకు తామొచ్చామని.. గత రెండ్రోజులుగా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జై కిసాన్.. రైతే రాజు.. అంటూ ప్రసంగాల్లో ఊదరగొట్టే నేతలు, అధికారులు చేతల్లో మాత్రం వారిని తీవ్రంగా అవమానిస్తున్నారు. సమయానికి పనులు చేయరు సరికదా.. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా చేసి.. వారిని మెట్లపై కూర్చోబెట్టి అవమానించారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. – సాక్షి, నరసరావుపేట

మహాత్ములారా.. మన్నించండి!



దేశ స్వాతంత్య్రం కోసం అహర్నిశలు శ్రమించి, ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన, పీడిత వర్గాలకోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహానుభావులు వారు.. అటువంటి గొప్పవారి చిత్రపటాలకు ఏ మాత్రం గౌరవ మర్యాదలు ఇవ్వకుండా, ఓ మూలకు పడేసిన వైనమిది. పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మన్యం వీరుడు అల్లూరి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితర నేతల చిత్రపటాలను చెత్త వలే ఓ మూలన పడేసిన అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. సాక్షాత్తు తహసీల్దార్ కార్యాలయంలో ఇటువంటి ఘటనలు జరిగితే ఎలాగంటూ ప్రశ్నిస్తున్నారు. – పెదకూరపాడు

ఈదుపల్లికి విష జ్వరం



నగరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

- రెండు రోజుల్లోనే భార్యాభర్తలు మృతి
- అనాథలుగా మిగిలిన ఇద్దరు కుమార్తెలు
- కదిలిన పాలకులు, అధికార యంత్రాంగం
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది
- గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

నగరం: నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి విషజర్వం సోకింది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో పాలకులు, అధికారులు స్పందించారు. సోమవారం రాత్రి జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ ఈదుపల్లి గ్రామంలో పర్యటించారు. మంగళవారం వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈదుపల్లి గ్రామంలో నెల రోజుల నుంచి విష జర్వాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులుగాని, అధికారులు గాని స్పందించలేదు. రెండు రోజుల్లోనే ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు తుమ్మల సుబ్బారావు, మహాలక్ష్మి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. సరైన సమయంలో వైద్య సిబ్బందిగాని, పంచాయతీ అధికారులు గాని స్పందించి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేది కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

ఈదుపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్వాలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగించాలన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి జర్వాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందజేయాలని సూచించారు.



ఈదుపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇంటింటి సర్వే

ఈదుపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. 450 కుటుంబాలలో సర్వే నిర్వహించగా 56 మందికి జర్వాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం శాంపిళ్లు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

నగరం: విషజర్వాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి ప్రజలకు సూచించారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఈదుపల్లి గ్రామంలో విష జ్వరాలు ఉండటంతో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వేలో 56మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మృతి చెందిన మహాలక్ష్మికి మాత్రమే డెంగీ లక్షణాలు ఉన్నాయని, ఆమె భర్త అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు తేలిందన్నారు. వైరల్ ఫీవర్లు వచ్చిన వారు ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకోవడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని రోజుల తరబడి రోగులకు చికిత్స చేయకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహాలక్ష్మికి డెంగీ వచ్చినట్లు గుర్తించని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో విషజ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 15 రోజులలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎంహెచ్ఎం డాక్టర్ విజయమ్మ, డీఎల్‌డీఓ పద్మ, డెప్యూటీ సీఈఓ కృష్ణ, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

2జీతో ఎలా జీ..!

- ఫోన్లలో లబ్ధిదారుల నమోదుకు అంగన్‌వాడీల తిప్పలు
- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు ఆపసోపాలు
- సరిగ్గా పని చేయని బాలసంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌లు
- జిల్లాలో 19 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాలు




మాకొద్దీ 2జీ ఫోన్లు అంటూ ఈ నెల 4న సత్తెనపల్లిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో ఆప సోపాలు పడుతున్నారు. ముఖచిత్ర గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. యాప్‌లు పనిచేయక వాటితో కుస్తీలు పడుతున్నారు. ఈ బాధలు పడలేని అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌ల భారం తగ్గించాలంటూ ఆందోళన చేపడుతున్నారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖచిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్‌లు సరిగ్గా పని చేయకపోవడం, 2జీ ఫోన్లతో సకాలంలో ముఖచిత్ర గుర్తింపు ప్రక్రియ జరగక పోవడంతో ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు.

సక్రమంగా సాగని పంపిణీ

లబ్ధిదారులకు పోషణ ట్రాకర్, బాల సంజీవని అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారు ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే 2జీ ఫోన్లు వల్ల నెట్ సరిగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలా సార్లు సక్సెస్ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వం బాల సంజీవని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తోంది. ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రేకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు ఈ రెండు యాప్ లను వినియోగించాల్సి వస్తోంది. ఇది కష్టంగా ఉందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

అంగన్‌వాడీలు నిర్వహించే రికార్డులు



పోషణ ట్రాకర్ యాప్


- లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్‌సీఆర్)
- పిల్లలు, గర్భిణులు, బాలింతలను నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్ఎన్)
- ప్రీ స్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాల నమోదు
- పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రిజిస్టర్
- విటమిన్–ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు
- నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్)
- ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే
- గ్రోత్ రికార్డ్, గ్రోత్ చార్టులు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి టేక్ హోం రేషన్ పంపిణీ రికార్డు
- స్టాఫ్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహణ

ఈ రికార్డుల నిర్వహణ, యాప్‌ల భారంతో చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

2జీ ఫోన్లతో తిప్పలు

పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉండడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్స్ ర్యామ్ తక్కువగా ఉండడంతో తక్షణమే యాప్ స్పందించక తిప్పలు తప్పడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2జీ ఫోన్లు మా కొద్దు 5జీ ఫోన్లు ఇవ్వాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఇదే విషయమై గత నెల 22న, ఈ నెల 4న సత్తెనపల్లిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన చేపట్టి 2జీ ఫోన్లు వెనక్కి ఇచ్చేశారు.

ట్రైబల్ ఫొటో అవార్డులకు ఎంపిక



కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫొటో

వినుకొండ: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాల సందర్భంగా క్రియేటివ్ కల్చర్ కమిషనర్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్లకు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. వినుకొండకు చెందిన వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపినెస్, కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫొటోలు అవార్డులకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ నెల 18న విజయవాడలో అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు.



వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపినెస్ ఫొటో

క్లుప్తంగా

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి



బెల్లంకొండ: దుకాణదారులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని క్రోసూరు డివిజన్ ఏడీఏ మస్తానమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను తహసీల్దార్ ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి అరుణకుమారితో కలిసి తనిఖీ చేశారు. నాణ్యతలేని విత్తనాలను, ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత పురుగుమందుల విక్రయం నేరమన్నారు. రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలనే విక్రయించాలని, అదేవిధంగా కొనుగోలు చేసిన ప్రతిదానికి రైతులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు.

లయన్స్ క్లబ్ జిల్లా రీజినల్ సెక్రటరీగా రామకోటయ్య



సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ జిల్లా రీజినల్ సెక్రటరీగా లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ మాజీ అధ్యక్షుడు, మాజీ జోన్ చైర్మన్ పాత్తూరి రామకోటయ్య నియమితులయ్యారు. 316 హెచ్ జిల్లా గవర్నర్ సీహెచ్ హరిప్రసాద్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పాత్తూరి రామకోటయ్య 2025–26 పల్నాడు జిల్లా రీజినల్ సెక్రటరీగా కొనసాగుతారు. ఈ సందర్భంగా లయన్స్ రీజినల్ చైర్మన్ తోట చిన్న సాంబయ్య. లయన్స క్లబ్ సభ్యులు, మిత్రులు, పలువురు రామకోటయ్యకు అభినందనలు తెలిపారు.

ప్రకృతి సాగు భేష్



పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావు ఆదర్శనీయమని సత్తెనపల్లి వ్యవసాయ శాఖ ఏడీఏ బోడపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా శేషారావు పొలాన్ని ఏడీఏ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 30 రకాలతో తీగజాతి, చెట్టు జాతి, కాయ జాతి, నూనె జాతి, పప్పు జాతి రకాలు వేసిన పొలాన్ని ఇప్పుడే మొట్టమొదటిసారి చూస్తున్నామన్నారు. వాణిజ్య పంటలు వేసే ప్రతి రైతు ముఖ్యంగా మిరప సాగు చేసే రైతులు పీఎండీఎస్ వేసుకోవాలన్నారు. పీఎండీఎస్ వేయటం ద్వారా ప్రధాన పంటకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పంట ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఆయన వెంట పెదకూరపాడు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లకు ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చని ప్రభుత్వం

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఎన్నికలకు ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ప్రభుత్వం నెరవేర్చలేదని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటామని, ఎటువంటి బకాయిలు లేకుండా వెంటనే చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏ మాత్రం నెరవేరలేదన్నారు. పెండింగ్ బకాయిలు, నాలుగు డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. వేతన సవరణ సంఘం చైర్మన్‌ను నియమించాలని, ఈ లోపు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. జూన్ నెలలో బదిలీలు జరిగిన 60వేల మందికి పైగా ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు వి.అక్కయ్య, కె.కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, షేక్ మగ్బూల్‌బాష, దుర్గా ప్రసాద్, జి.కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బి.రవి, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

జిల్లా 'ఉపాధి' పీడీ సిద్దా లింగమూర్తి



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఉపాధి పీడీ లింగమూర్తి

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇకపై ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తారని జిల్లా ఉపాధి హామీ పథకం పీడీ సిద్దా లింగమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూజెండ్ల, బొల్లాపల్లి మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు నూతన మస్టర్ విధానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో అవినీతి, అక్రమాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఒక్కో ఉపాధి కూలీ ముఖ ఆధారిత చిత్రాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఎఫ్ఏలు పని ప్రదేశంలో ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌తో హాజరు నమోదు చేయాలన్నారు. అలాగే ఈకేవైసీ నమోదు చేయించుకోని వారికి వేతనం మంజూరు కాదన్నారు. ఉపాధి శ్రామికులు చేసిన పనులకు సంబంధించిన పని కొలతలు, సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై గ్రామాల్లో క్షేత్రసహాయకులు ప్రచారం చేయాలన్నారు. నకిలీ మస్టర్స్‌కు తావు లేకుండా నూతన విధానం దోహదపడుతుందన్నారు. శిక్షణా తరగతులు పూర్తికాగానే నూతన విధానం అమల్లోకి వస్తుందన్నారు. శిక్షణా తరగతుల్లో జిల్లా ప్లాంటేషన్ ఉద్యాన అధికారి శిరీషా, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీఓలు ఆంజనేయరాజు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం కావాలి

జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి అమలకుమారి



శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడుతున్న అమలకుమారి

ఈపూరు(శావల్యాపురం): ప్రకృతి వ్యవసాయంలో రైతుసేవా కేంద్రం వీఏఏలు భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి అన్నారు. మంగళవారం ఈపూరులోని రైతుసేవా కేంద్రంలో బొల్లాపల్లి, శావల్యాపురం, ఈపూరు మండలాలకు చెందిన వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కె.అమలకుమారి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మోతాదు పెరగటం వలన భూమిలో పోషకాల శాతం తగ్గిపోయి మానవాళి అంతు చిక్కని వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యంగా ఉండి రైతులకు పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. నీటి నిల్వ స్థాయి సామర్థ్యం పెంపుదలతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. జిల్లా డీడీఏ కార్యాలయ అధికారి హనుమంతరావు, వినుకొండ ఏడీఏ రవికుమార్, ఏఓలు రామినేని రామారావు, ఆంజనేయనాయక్, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య, డీటీ శివలక్ష్మి, తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, లక్ష్మణ్‌నాయక్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో వైజ్ఞానిక ఆలోచనలు రేకెత్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులతో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించాలని గుంటూరు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి జి.ఏ సురత్నం పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఇన్‌స్పైర్ మానక్‌పై డివిజన్ పరిధిలోని సైన్సు ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్సు అధికారి షేక్ గౌసుల్‌మీరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏసురత్నం మాట్లాడుతూ భావి శాస్త్రవేత్తల రూపకల్పనకు నాందిగా ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చునని అన్నారు. ప్రాథమికోన్నత బడుల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, హైస్కూల్ ప్లస్ నుంచి ఏడు చొప్పున నామినేషన్లు పంపాలని స్పష్టం చేశారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సైన్సు అధికారి షేక్ గౌసుల్‌మీరా, రీసోర్సు పర్సన్లు డి. శివ శంకరరావు, డీవీ రమణ పాల్గొన్నారు.

టీపీఓపై అవినీతి ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ

టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మధుకుమార్



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మధుకుమార్

సత్తెనపల్లి: సత్తెనపల్లి టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ) రాధాకృష్ణపై క్షేత్రస్థాయిలో విచారించి చర్యలకు సిఫార్సు చేస్తానని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ గుంటూరు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్ అన్నారు. సత్తెనపల్లి టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటమే కాక కార్యాలయం ముగిసిన తర్వాత ప్లానింగ్ సెక్రటరీల ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని, ఇటీవల కౌన్సిల్ సాధారణ సమావేశంలో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ నిమిత్తం మధు కుమార్ సత్తెనపల్లి పురపాలక సంఘాన్ని మంగళవారం సందర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణలతో పాటు మరికొందరు టీపీఓ రాధాకృష్ణపై పలు ఆరోపణలు చేయడమే కాకుండా లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు అందించారు. ఈ క్రమంలో క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. అనంతరం టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో ప్రత్యేక టీంను ఏర్పాటు చేస్తానని, ఆ టీం క్షేత్రస్థాయిలో అనధికార లేఅవుట్లు, ఆక్రమణలు తొలగింపులో పక్షపాత ధోరణి, అంతేకాక ఎవరెవరు దగ్గర ఎలాంటి వసూళ్లకు పాల్పడ్డారనే అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇస్తుందని, దాని ప్రకారం చర్యలకు డీటీసీకి సిఫార్సు చేస్తానన్నారు. ఆయనతో పాటు ఆర్డీ కార్యాలయ టీపీఓ పూర్ణచంద్ర రావు ఉన్నారు.

ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్ జాతీయ కార్యదర్శిగా క్రిష్టర్



పాస్టర్ నందమూరి కిష్టర్

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శాంతినిలయం అధినేత, బ్రదర్ నందమూరి క్రిష్టర్ ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. గత శనివారం కోనసీమ జిల్లా తాపేశ్వరంలో జరిగిన జాతీయ స్థాయి పాస్టర్ల సమావేశంలో ఆయనను ఈ ఉన్నత పదవికి ఎన్నుకున్నట్లు తెలిపారు. 17 రాష్ట్రాల ప్రతినిధులు సభ్యులుగా ఉన్న ఈ ఫెలోషిప్‌లో పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న క్రిష్టర్ జాతీయ స్థాయి పదవిని చేపట్టడంపై పల్నాడు జిల్లా పాస్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దైవసేవకులు నందమూరి క్రిష్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా క్రైస్తవుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన ఎన్నికతో క్రైస్తవ సమాజం మరింత బలోపేతం అవుతుందని పలువురు పాస్టర్లు, సేవకులు అభిప్రాయపడ్డారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



ఊసా నాగేంద్రబాబు

నకరికల్లు: పిడుగుపాటుకు గురైన వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన మండలంలోని కుంకలగుంట గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి.. కుంకలగుంట గ్రామానికి చెందిన ఊసా నాగేంద్రబాబు(36) వరి విత్తనాలు చల్లేందుకు గాను కూలి పనులకు వెళ్లాడు. అదే సమయంలో కురుస్తున్న వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు గురైన నాగేంద్రబాబు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంధువులు హుటాహుటిన నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య శ్రావణి, ఒక కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

డెంగీతో మహిళ మృతి

నాదెండ్ల: డెంగీ జ్వరంతో వివాహిత మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన కూరపాటి మల్లేశ్వరి (36) మూడు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించటంతో మరో ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. మల్లేశ్వరి డెంగీ వ్యాధితో మృతి చెందిందని వైద్యులు బంధువులకు తెలిపారు. స్థానిక వైద్యాధికారి సాయిశ్వేతను వివరణ కోరగా వైరల్ ఫీవర్ కారణంగా మల్లేశ్వరి మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



సంఘటన స్థలంలో ప్రమాదానికి కారణమైన కారు, దెబ్బతిన్న బైక్

యడ్లపాడు: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు కాగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట వైపునకు వెళుతున్న కారు టైర్ పంక్చర్ కావడంతో యడ్లపాడు జాతీయ రహదారిపై పిల్లికొండ వద్ద కారు నిలుపుదల చేసుకున్నారు. అయితే అదేమార్గంలో మండలంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన అన్నలదాసు తేజ్‌పాల్, దావల యువరాజు అనే ఇద్దరు యువకులు బైక్‌పై చిలకలూరిపేట వైపునకు ప్రయాణిస్తున్నారు. కారుడ్రైవర్ అకస్మాత్తుగా డోర్ తెరవడంతో బైక్ వేగంగా వచ్చి డోర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు రోడ్డుపై పడి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వారిని చిలకలూరిపేట, గుంటూరు పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అయితే వారిలో ఒకరికి మెదడులో బ్లడ్ క్లాట్, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

తెనాలి రూరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీలు



మంగళగిరి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్, డీఆర్ఎం సుధేష్ణ సేన్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం పగిడిపల్లి – గుంటూరు – కృష్ణా కెనాల్ – విజయవాడ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఆయా ప్రాంతాల్లో పాల్గొన్నారు. ముందుగా జీఎం ఈ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీ నిర్వహించారు. సిగ్నలింగ్, రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పరిశీలించారు. నల్గొండ రైల్వే స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, దివ్యాంగుల టాయిలెట్లు, లిఫ్ట్, తాగు నీటి సౌకర్యం వంటి వాటిపై సమీక్షించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. తర్వాత గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుంటూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. తర్వాత మంగళగిరి రైల్వే స్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, పనులను గడువు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వృద్ధురాలి హత్య

లక్ష్మీపురం: వృద్ధురాలిని కొట్టడంతో కింద పడి అక్కడిక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం గుజ్జనగుండ్లలో చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన ఆకుల అంజమ్మ (70)కు కుమార్తె ఉప్పాల త్రివేణి ఉంది. త్రివేణికి తారకరామనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మి స్నేహితురాలు. ఇద్దరు కలిసి బంగారం తాకట్టు పెట్టిన వ్యవహారంలో మనస్పర్థలు వచ్చాయి. లక్ష్మీతో త్రివేణి భర్త దురుసుగా ప్రవర్తించాడు. ఆమెకు సర్దిచెప్పడానికి త్రివేణి గుజ్జనగుండ్లకు వెళ్లింది. ఆ సమయంలో లక్ష్మి బయటకు వెళ్లగా.. ఆమె తల్లి అంజమ్మ ఉంది. త్రివేణిని చూడగానే ఆమెను దుర్భాషలాడింది. కోపంలో త్రివేణి ఆమెను చెంపపై గట్టిగా కొట్టడంతో కింద పడి అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న లక్ష్మీ వెంటనే పట్టాభిపురం పోలీసులకు సమాచారం తెలిపింది. వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై త్రివేణిలు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. హత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జీజీహెచ్‌కు పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

సత్తెనపల్లి: ఉరివేసుకొని వ్యక్తి బలవన్మరణకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన పాలేటి మహేష్(29) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సుమారు 13 ఏళ్ల క్రితం భీమవరం గ్రామానికి చెందిన దయామణితో వివాహం అయ్యింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా 8 ఏళ్ల క్రితం భీమవరం గ్రామానికి చెందిన స్నేహితుడి భార్య ప్రశాంతితో వివాహేతర సంబంధం పెట్టుకోగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఆక్రమంలో మనస్తాపానికి గురైన ఆమె భర్త రైలు కింద పడి మృతి చెందాడు. అయినప్పటికీ వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో పాలేటి మహేష్ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో భీమవరం గ్రామానికి వెళ్లి వారి బంధువులతో కలిసి గుడిపూడి గ్రామంలో జరిగిన ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి రాత్రి 10 గంటలకు సత్తెనపల్లి టౌన్‌కి చేరుకున్నాడు. ప్రశాంతి, మహేష్ కలిసి రెండు నెలల క్రితం కొత్తగా అద్దెకు తీసుకున్న రేకుల ఇంటిలో ఉంటున్నారు. ఆ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ప్రశాంతి, పిల్లలు పడుకోగా మృతుడు హాల్లో పండుకున్నాడు. మృతుడు బెడ్‌రూమ్ తలుపు వేసి ఇంటికి బయట నుంచి తాళం పెట్టి చీరతో ఫ్యాన్‌కి ఉరివేసుకొని మరణానికి గల కారణాలను ఒక చిన్న పేపర్ మీద రాసి పెట్టాడు. ప్రశాంతి ఉదయాన్నే 6:30 గంటలకు లేచి బెడ్‌రూమ్ తలుపు తట్టగా ఎంతసేపటికీ భర్త తలుపు తీయకపోవడంతో కిటికీ వైపు నుంచి రోడ్డుపై వెళ్తున్న సాకే కోటేశ్వరరావును కేకలు వేసి పిలువగా చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీశారు. ఇంటి కప్పు రేకులకు వేసిన రాడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య దయామణి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

ముప్పాళ్ళ: భార్యపై భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు మంగళవారం తెలిపారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన తలపాల పిచ్చయ్య, నాగరాణి దంపతులు మనస్పర్థలతో విడిపోయి వారి కుమారుల వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పిచ్చయ్య, తన చిన్న కుమారుడు తలపాల జగన్నాధం, అన్న తలపాల శ్రీను, అన్న కొడుకు తలపాల విష్ణులతో కలిసి భార్య నాగరాణి వద్దకు వచ్చి ఊరు విడిచి వెళ్లాలని, లేకుంటే చంపేస్తామంటూ బెదిరించారు. ఈ క్రమంలోనే పిచ్చయ్య కర్రతో నాగరాణి తలపై కొట్టడంతో తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయింది. గాయపడిన నాగరాణిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితురాలు నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.